





# బాల 'గీత'కారుడు డా. ఎన్. గోపి



'ముట్టుకుంటె తగలాలి కవిత్వం మనిషిలాగా' అన్న మహత్వ కవిత్వ దీక్షతో కవిత్వం వ్రాస్తున్న నిరంతర చలనశీల మహాకవి, 'మానవ సంబంధాల్ని కవిత్వం చేస్తున్న సామాజిక డాక్టర్ ఎన్.గోపి గారు. వారు ఉస్మానియా తెలుగుశాఖలో ఆచార్యుల నుండి ప్రతిష్టాత్మక తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా, వివిధ విశ్వవిద్యాలయాలకు ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. **'కాలాన్ని నిద్ర పోనివ్వను'** కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. నేటి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జూన్ 25, 1948న పుట్టారు. శ్రీమతి నక్క లక్ష్మమ్మ-శ్రీ చెన్నయ్య దంపతులు అమ్మానాన్నలు.

గోపిగారు ఏడవ తరగతి విద్యార్థిగా భువనగిరి గ్రంథాలయంలోకి ప్రవేశించి స్కూలుఫైనల్ లోపే మూడువేల పుస్తకాలు చదివారు. బాల్యం నుండే మహాకవి డా.సి. నారాయణరెడ్డి గారి కవిత్వం చదివి, వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవారు. బాలకవిగా ఎనమిదవ తరగతిలో 'శశీ' మకుటంతో శతకం రాశారు. ఇది 'నేత' పత్రికలో అచ్చయ్యింది. ఇప్పటికి వీరివి యాభై ఏడు గ్రంథాలు అచ్చయ్యాయి. **'తంగెడుపూలు', 'మైలురాయి', 'కాలాన్ని నిద్రపోనివ్వను', 'జలగీతం', 'చుట్టకుదురు', 'జీవన భాష', బృహత్ కవితా సంపుటి 'మనిషిని కలిసినట్టుండాలి', తాజా కవితా సంపుటి 'రేపటి మైదానం'** వరకు 29 కవితా సంపుటాలు, 6 విమర్శ గ్రంథాలు, 4 పరిశోధన గ్రంథాలు, 6 యాత్రా చరిత్రలు, 6 అనువాదాలు, మరో 4 ఇతర రచనలు ఉన్నాయి.

గోపి గారు విద్యార్థిగా రచనలు చేస్తూనే 1965-66 మధ్య పిల్లల కోసం చక్కని బాల గీతాలు రాశారు. ఇవన్నీ 'ప్రజామత', 'కృష్ణాపత్రిక', 'నేత' పత్రికల్లో అచ్చయ్యాయి. సినారె గారు ఒకచోట "తొలి, మలితరాల సాహితీవేత్తలందరూ ఏదో ఒక సందర్భంలో పిల్లల కోసం యిష్టంగా రాసినవాళ్ళే" అంటారు. వారిలో గోపిగారు ఒకరు. 'నానీ' కవితా రూప సృష్టికర్త యాభైయేండ్ల క్రితమే నానీలకు గేయ తాయిలం అందించారు.

**'అమ్మమ్మ దగ్గరికి/బొమ్మ గుర్రము నెక్కి/పోయి వస్తానమ్మ/పోయి వస్తాను'** అంటూ బాల్యంలో అమ్మమ్మ యింటితో పిల్లలకున్న బంధాన్ని, అక్కడి ప్రేమలను గురించి 'బొమ్మగుర్రం'లో చెప్పిన కవి అమ్మమ్మ పెట్టే తినుబండారాలు, తాత కుట్టించే బట్టలు, అత్తామామల ప్రేమలను చక్కగా చెబుతారు. మరో మంచి గేయం **'బూచి'**. ఇందులో బూచిని చూపించి పిల్లలను భయపెట్టె తల్లితండ్రుల్ని సంబోధిస్తూ **'...పిరికి మందును నాకు / పోయకే మాయమ్మ / దమ్మంటె బూచాన్ని/ రమ్మనవె దబ్బున'** అంటారు. అంతటితో ఊరుకోరు, **'చెప్తె నమ్మవు కాని /చూపిస్త నా గొప్ప'** అంటూ బాలల మనస్సుల్లో పిరికితనాన్ని నింపొద్దని చాటుతారు. నిజం కదూ!

గోపిగారి ఈ బాల గీతాల్లో సరదా గీతాలు, ఆటపాటల గీతాలు, అనుబంధాల గీతాల వంటివి అనేకం ఉన్నాయి. వాటిలో **'బొజ్జతాత'** సరదాగా పాడుకునే గీతం. **'జేజేలండీ జేజేలు! / తాత బొజ్జకు జేజేలు!! .... తాత జొజ్జపై బాజాలు / తాత బొజ్జపై ఎగిరేవారు / తప్పక అగుదురు రాజాలు'** అంటారు. ఇంకా తాత పిలక గురించి, ఆటల పాటల గురించి, బాలలను బంగరు పౌరులుగా తీర్చిదిద్దే తాత కథల గురించి అద్భుతంగా గేయంలో చెబుతారు. **'జేజేలండీ జేజేలు!/తాత కథలకు జేజేలు!!'** అంటూ మన బాల్యాన్ని వెలిగించిన రాజకుమారుల కథలకు జేజేలు పలుకుతారు.

ఇవి గోపిగారు అరవై యేళ్ళ క్రితం వ్రాసుకున్న బాలల గేయాలు. ఈ పుస్తకం మా 'పత్తిపాక ఫౌండేషన్-గరిపెల్లి ట్రస్టు, రాజన్న సిరిసిల్ల జిల్లా' ప్రచురణగా వస్తోంది. సంస్థ కన్వీనర్ గరిపెల్లి అశోక్, సంపాదకులు డా.సిరిసిల్ల చందన, ఆత్మీయ మిత్రులు డా.రఘు, డా. నీరజ జవ్వాజి, మనాశర్మ లకు షుక్రియా! మా సార్ ఆచార్య ఎన్. గోపి-శ్రీమతి అరుణ దంపతులకు వినమ్ర నమస్సులు.



**- డా. పత్తిపాక మోహన్**
సాహిత్య అకాడమి బాల సాహిత్య
పురస్కార గ్రహీత



బూచి బూచని నాకు
బుగులు పుట్టిస్తావు
ఆకలిగ లేదు నా
కన్న మొద్దని అంటె.
బూచొచ్చె బూచొచ్చె
బుజ్జి బజ్జో మంచు
తప్పించుకుంటావు
చెప్పమంటే కథను.
పిల్లులకు భయపడే
పిరికి వాణ్నను కొని
ఎలికపిల్లను చూసి
ఎగిరి పడతానని
అన్నయ్య లాగ నను
అనుకొంటివో యేమొ
పిరికి మందును నాకు
పోయెకే మాయమ్మ
దుమ్ముంటే బూచాన్ని
రమ్మనవె దబ్బున
చెప్తే నమ్మవు గాని
చూపిస్త నా గొప్ప
బూచి బూచిని నాకు
బుగులు పుట్టించకే.




జేజేలండీ జేజేలు!
తాత బొజ్జకు జేజేలు!!
తకధిం తకధిం తకధిమ్మంటూ
తాత బొజ్జపై బాజాలు
తాత బొజ్జపై ఎగిరేవారు
తప్పక అగుదురు రాజాలు.
జేజేలండీ జేజేలు!
తాత పిలకకు జేజేలు!!
అటు ఇటు ఇటు అటు ఎగురుతు ఆడును
హాయిని గొలిపే నాట్యాలు
హాయిని గొలిపే ఆ నాట్యాలకు
చిందులు వేస్తాయ్ హాస్యాలు
జేజేలండీ జేజేలు!
తాత కథలకు జేజేలు!!
తాత కథల్లో చెరబట్టబడిన
రాజకుమార్తెకు జేజేలు
రాజకుమార్తెను విడిపించిన ఆ
రాచకుర్రనికి జేజేలు!

## పొట్టి బావ



ఒక్కనాటి పండుగకు
తిక్క బావ వచ్చాడు
పొట్టివాడె అయినా బహు
గట్టి వాడు సుమండి.
పువ్వుల గౌనులు నాకు
రవ్వల గొలుసక్కయ్యకు
చిన్ని తమ్మునికి బొమ్మ లి
వన్ని ఎట్ల తెచ్చినాడో!
అమ్మ పెట్టు లడ్డూలు
అక్క పెట్టు అప్పడాలు
ఒక్క ముక్క మిగలకుండ
మెక్కినాడు కడుపునిండ.
టక్కరి బావే కాని
మక్కువండి మాపైన
అతడుంటే ఇల్లంతా
ఆనందం వెల్లివిరియు

## కర్మసాక్షి



మందారపూవు వలె
అందమొలికెడు వాడు
తూర్పు కొండల నుండి
తొంగి చూసెడువాడు
ఆకాశవీధిలో
అరుగుచున్నాడహో!
వెండి కిరణాలతో
వెలుగుచున్నాడహో!!.
ఒక్క నిముసము కూడ
ఊరికే కూర్చోడు
అస్తమానము పనుల
టంచు తిరిగేవాడు.
కాక కలిగినవాడు
కమలమ్ము సైదోడు
చీకట్ల రాక్షసుల
చీల్చివేసేవాడు.
మిరుమిట్లు గొలిపేటి
మెరుపు కొరడాల్ పూని
బొబ్బవెట్టుచు వచ్చు
మబ్బుల్ల గుంపులు
వెలుగు పూలను దోచ
వీని బంధించగా
ఎడమ కాలున తన్ని
వెడల గొట్టెడువాడు
చవులు చిందగలేని
చందమామను చూచి
కాంతిప్రేమను చల్లి
గారవించిన వాడు
ఆకాశవీధిలో
అరుగుచున్నాడహో!
జోతలర్పించగా
చేతులెత్తండహో!
చురుకుదనములు మదిని
ఉరకనీయండహో!

## ఎలుకమ్మ పెండ్లి



ఎలుకమ్మ పెండ్లండి
ఎలుకమ్మ పెండ్లి
ఎలుకమ్మ పెండ్లికి
ఎన్నో సరదాలు.
చుట్టాలు పక్కాలు
చూడ వచ్చారు
కానుకలు దండిగా
పట్టుకొచ్చారు.
పిల్లి వచ్చిందండి
పెండ్లి కొచ్చింది
పగ మరిచిపోయింది
నగలు తెచ్చింది.
డేగ వచ్చిందండి
వేగ వచ్చింది
పాతవైరము మరిచి
బహుమతిచ్చింది.
ఎలుక పెళ్ళికొడుకు
పలుక లేదమ్మా
చిత్రాంగ పిలగాడు
సిగ్గు పడెనమ్మా!
ఎలుక పెండ్లి పిల్ల
కులికి నాదమ్మా
అందచందాలను
చిలికి నాడమ్మా!
ఎలుక నర్తకురాళ్లు
ఎగిరి ఆడారు
ఎలుక గాయకురాళ్లు
కలిసి పాడారు.
కలనైన ఇలనైన
తలపోయనట్టి
విందు వంటలతో ప
సందు చేశారు.
'ఏమి పెండ్లండి మే
మెచట చూడనిది'
అని బంధుగణమంత
'అబ్బో' అన్నారు.

## చిన్నారి కోరిక



అమ్మ! వీధికి మురళు
లమ్మొచ్చి నాయిపుడు
కొనిపెట్టవే ఒకటి
కొనిపెట్టవమ్మ.
మురళినే వాయించి
మురిపాలు రాల్చెదను
చిన్నకృష్ణుని కన్న
మిన్నగా పాడెదను.
కలకంఠ, కీరముల
కంటె కమ్మగ పాడి
నా గాన మాధురుల
ఊగింతు నీ మనసు.
అమ్మలందరి కన్న
మంచిదానివి నువ్వు
ముచ్చటగ నాకొక్క
మురళి కొనిపెట్టవే.
మురళి కొనిపెట్టనిచొ
ముద్దివ్వ నీకింక
నువ్వెన్ని చెప్పినా
నేను విననే అమ్మ.



## కీలుగుర్రం

కలవచ్చె కమ్మని
కలవచ్చె వేకువన
కలలోన గగనలో
కాలు దర్శించాను.
రివ్వుమని బాణమ్ము
రీతిగా పరుగెత్తు
కీలుగుర్రము పైన
గాలిలో పయనించి
గాలిలో పయనించి
గగనాలు చేరాను
గగన లోకాలలో
కలయ విహరించాను.



## బొమ్మగుర్రం


అమ్మమ్మ దగ్గరికి
బొమ్మ గుర్రము నెక్కి
పోయివస్తానమ్మ
పోయి వస్తాను.
అమ్మమ్మ పెడ్తుంది
అప్పచ్చులెన్నో
కుట్టించు తాతయ్య
కొత్త చొక్కాలు.
మామయ్య చెప్తాడు
మంచి కథ లెన్నో
అత్తయ్య ఇస్తుంది
ఆట బొమ్మలను.
చిన్నారి మరదలూ
మున్ని రమ్మంది
ఎంచక్కగా కలిసి
ఎగుర వచ్చంది.
అమ్మమ్మ దగ్గరికి
బొమ్మ గుర్రము నెక్కి
పోయి వస్తానమ్మ
పోయి వస్తాను.

## రెక్కలుంటే!



గమ్మత్తుగ నాకే రె
క్కలు మొలిచిన వనుకోవే
ఆకాశపు వీధులలో
హాయిగ విహరించి వస్త.
రెక్కలతో మక్కువతో
చుక్కల లోకం చేరెద.
చొక్కా నిక్కరు జేబుల
చుక్కలన్ని కూరి తెస్త.
సత్వరమటనుండి పోదు
చందమామ దర్బారుకు
నన్నుచూచి చిరునవ్వుల
వెన్నెలలను వెదజల్లును.
అమ్మా! ఆ చందమామ
అందము లేమని చెప్పను!
చూడ చూడ రెండు కనులు
చాలవేమొ అనిపించును.
రేపొ మాపొ నీ వద్దకు
రాబోతున్నాము మేము
స్వాగతమ్ము పలుకుటకు
సన్నాహము చేయమంట.
మీదట మేఘం చెంతకు
పోదు ఆమె నీలవేణి
మెరుపుల జరికుచ్చులతో
మిరుమిట్లను గొలుపసాగె.
పవనునితో ఆటలాడి
పరవశించు ఓ బాలా!
పుడమిపైన వర్షాలను
పుష్కలముగ రాల్చుమ్మా.
మురియుచు వినువీధులలో
తిరిగి తిరిగి వస్తాను
అక్కడి వింతలనన్నీ
అమ్మకు వివరిస్తాను.

## ఎవడే!



అమ్మా! ఎవడే వాడు
అద్దంలో అగుపించెను
ఎప్పుడైన నా మాదిరి
'హీ హీ' అని ఇకిలించును.
నావంటిదె గళ్లచొక్క
నాదే నల్లని నిక్కరు
నాలాగే పోజు పెట్టి
నన్ను వెక్కిరిస్తాడే.
కళ్లు రెండు సగం మూసి
పళ్ళికిలించాను నేను
అచ్చంగా నాలాగే
అనుకరించి చూపాడే.
నాలాగే బుగ్గతీసి
నట్టి చక్కనైన జుట్టు
నా లాంటిదె చుక్కబొట్టు
నావే ఆ చిరునవ్వులు.
అమ్మా! ఎవడే వాడూ
ఆకతాయి బాపతు
నాలాగే అనుకరించి
నన్ను వెక్కిరించును



## బొమ్మలకే ప్రాణాలొస్తే!

అమ్మా! నేనాడుకునే
బొమ్మలకే ప్రాణమొస్తె
మస్తుగ వారందరికి
దోస్తునయ్యి పోతానే.
ఉట్టుట్టిగ మేమొండే
మట్టి వంటలన్ని కూడ
పాయసంగ మారిపోతే
తీయగ మెక్కేస్తామే.
కొల్లలుగా నేనేరే
చిల్లపెంకులన్ని కూడ
బంగారుగ మారిపోతే
పొంగిపోయి మురిసెదమే.

## చిన్నారి చేష్టలు



మట్టిపైన పిచ్చి
గీతలను గీస్తే
ముత్యాల ముగ్గులా
కనిపించు మాకు.
కిలకిలామని పాప
నవ్వులొలికిస్తే
సెలయేటి స్వనములా
వినిపించు మాకు.
ఒయ్యారముగ పాప
అడుగులేస్తుంటె
మయూరము ఆటలా
అన్పించు మాకు.
చిట్టి మా పాపాయి
గట్టిగా నవ్వుతూ
ముఖములో ముఖముంచి
మోదాన్ని కూర్చును.
అలుకబూనిన వేళ
చూడాలి పాపను
అందాల జాబిల్లి
సిగ్గుపడునప్పుడు

## యక్ష ప్రశ్నలు



చిట్టి మా పాపాయి
గట్టి ప్రశ్నలు వేసి
విస్తు పో జేస్తుంది
విసుగు కలిగిస్తుంది.
యక్ష ప్రశ్నల వంటి
లక్ష ప్రశ్నలు వేసి
తికమకలు పడుతుంటె
పకపకా నవుతుంది
రాత్రిళ్ళు సూరీడు
రాడేమి అంటుంది.
పగలు చంద్రుడు ఎందు
కగ పడడు అంటుంది.
చెప్పజాలక అమ్మ
తప్పించుకో జూస్తె
మంకుపట్టును పట్టి
మారాము చేస్తుంది.
చిన్ని మా బుజ్జాయి
కన్ని సందేహాలె
తీర్చడానికి బ్రహ్మ
దేవుడే రావాలి.
ఎన్ని జన్మల ఫలమొ
చిన్నారి మా పాప
చిలుక పలుకుల లోన
చిలికించు అమృతము

